క్లుప్తంగా

రహదారికి మరమ్మతులు చేపట్టండి



బుజ్రాన్‌పల్లి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లిలో రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. మండల కేంద్రం నుంచి హన్మంత్‌రావుపేట మీదుగా నారాయణఖేడ్‌నికి వెళ్లే దారిలో బుజ్రాన్‌పల్లి వద్ద రహదారిపై భారీగా గుంతలు ఏర్పడ్డాయన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టడంతో పాటు రెండు వరుసల రహదారిగా విస్తరించాలని కోరుతున్నారు.

ఆశాజనకంగా వరి సాగు



కొత్తపేట శివారులో సాగవుతున్న వరి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో వరిపంట ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో మండల కేంద్రంతో పాటు వీరోజిపల్లి, జూకల్, కొత్తపేట, రామోజిపల్లి, బూర్గుపల్లి, శివాయిపల్లి, గొట్టి ముక్కులు, బుజ్రాన్‌పల్లి, కోళాపల్లి తదితర గ్రామాల్లో చెరువులు, కుంటల ఆయకట్టు రైతులు వరిపంటను అధిక సంఖ్యలో సాగు చేశారు. ప్రస్తుతం వరిపంట కంకుల వేసే దశలో ఉంది. ఈ నేపథ్యంలోనే ఆయా గ్రామాల్లో ఇప్పటికే ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

పాపన్నపేట(మెదక్): ఇటీవల రెండు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో మృతి చెందిన శేరి మహబూబ్ కుటుంబాన్ని నాగ్సాన్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బాధిత పిల్లల చదువుల కోసం అవసరమైన సహాయాన్ని చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు భరత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): గర్భగుడిలో కొలువైన చాముండేశ్వరీ అమ్మవారు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిటుకుల్ శివారులో మంజీరా తీరన వెలసిన చాముండేశ్వరీ అమ్మవారికి ఆదివారం కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు. ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో..

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవాదయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేష్, విఘ్నేష్ నల్లపోచమ్మదేవి ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ మేరకు మహిళలు ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.



కొడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ దేవిని దర్శించుకున్న భక్తులు

మాటలకే పరిమితం!

ఖాళీ ప్రదేశాల్లోనే చెత్త డంపింగ్

- పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం
- తడి, పొడి చెత్తపై కొరవడిన అవగాహన



వెల్దుర్తి శివారులోని ఓ పాడుబడిన పరిశ్రమ స్థలంలో పారబోస్తున్న చెత్త

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామాల్లో చెత్త సేకరణ, కంపోస్ట్ ఎరువు తయారీ, పంచాయతీలకు అదనపు ఆదాయం వంటి ఆలోచనలు మాటలకే పరిమితమయ్యాయి. పల్లెలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు చెత్తనుంచి సంపద తయారీకి ప్రభుత్వం ప్రతీ పల్లెల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. రూ.లక్షల్లో వెచ్చించి నిర్మించిన షెడ్‌లు మొదట్లో లక్ష్యం నెరవేర్చేదిశగా కనిపించినా కాలక్రమేనా అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. కంపోస్ట్ షెడ్ నిర్మించిన ప్రారంభంలో ప్రతీ ఇంటి నుంచి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి కంపోస్ట్ ఎరువు తయారు చేశారు. ఈ ఎరువును గ్రామ పంచాయతీ నర్సరీ నిర్వహణలో ఎక్కువగా వినియోగించారు. ఆ తర్వాత కంపోస్ట్ ఎరువు తయారీ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను పంచాయతీ సిబ్బంది డంపింగ్‌యార్డ్‌లకు తరలించకుండా ఎక్కడపడితే అక్కడే పారబోస్తున్నారు. అటవీప్రాంతం, ఖాళీ ప్రదేశాలు కనిపడితే చాలు చెత్తంతా అక్కడే డంపింగ్ చేసి చేతులు దులిపేస్తున్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు..

రూ.లక్షల్లో వెచ్చించి నిర్మించిన షెడ్లు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. మండలంలోని గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులకు అనుసంధానంగా కంపోస్టు షెడ్లు నిర్మించారు. ఒక్కో కంపోస్టు షెడ్డుకు రూ. 2.50లక్షలు వెచ్చించారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రతీ ఇంటి నుంచి ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల వద్ద తడి, పొడిచెత్తలను రెండుగా వేరుచేయాల్సి ఉండగా ఆచరణలో అమలు కావడంలేదు. ప్రస్తుతం ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను కంపోస్ట్ షెడ్ల వరకు తరలించకుండానే ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు.



ధర్మారం అటవీప్రాంతంలో దర్శనమిస్తున్న చెత్త



ఆరెగూడెం డంపింగ్‌యార్డ్‌లో ట్రాక్టర్ పార్కింగ్

దారుణంగా డంపింగ్ యార్డ్‌లు..

గ్రామాల్లో డంపింగ్ యార్డ్‌ల పరిస్థితి మరి దారుణంగా తయారయ్యాయి. చెత్త సేకరణ, కంపోస్ట్ ఎరువు తయారీ కోసం నిర్మించిన షెడ్లు ప్రస్తుతం నిర్వహణ లేక ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారాయి. పంచాయతీ సిబ్బంది, అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో పలువురు ట్రాక్టర్లు, ఇతర వాహనాలను పార్కింగ్ చేయడం కోసం వినియోగిస్తున్నారు. దీంతో రూ.లక్షల్లో నిర్మించిన షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు కంపోస్టు షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావడంతో పాటు సేంద్రియ ఎరువులు తయారు చేసి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

కంపు కొడుతోంది..



ధర్మారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన చెత్తను డంప్ చేస్తున్నారు. గుంతల్లో వర్షపు నీరు చేరుతుండడంతో దుర్వాసన వస్తుంది. దీంతో రోడ్డుపై ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– శ్రీనివాస్, ప్రయాణికుడు

వాడుకలోకి తీసుకురావాలి



వెల్దుర్తి గ్రామ శివారులోని పాడుబడిన ఫ్యాక్టరీ ప్రదేశంలో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రూ.లక్షల్లో వెచ్చించి నిర్మించిన షెడ్లు వృథాగా వదిలేసి ఖాళీ ప్రదేశంలో చెత్తను డంపింగ్ చేయడం దారుణం. ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్‌యార్డ్‌లను వినియోగంలోకి తేవాలి. – చిరంజీవి, వాహనదారుడు

మహాసభలకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ మహాసభ ఆహ్వాన సంఘం నాయకులు

నర్సాపూర్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న సీఐటీయూ మహాసభలకు ప్రజలు, కార్మికులు విరాళాలు ఇవ్వాలని మహాసభల ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ ఆడివయ్య కోరారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు ఆదివారం మండలంలోని పెద్దచింతకుంటలో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 7నుంచి 9వరకు మెదక్‌లో సీఐటీయూ రాష్ట్ర ఐదవ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలో తొలిసారి రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, ప్రజలతో పాటు కార్మికులు యూనియన్‌కు విరాళాలు అందజేసి అండగా ఉండాలని కోరారు. ఆయన వెంట యూనియన్ నాయకులు నాగరాజు తదితరులు ఉన్నారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భూసారానికి తగిన పంటలను సాగుచేసుకోవాలని లయోలా కాలేజీ వ్యవసాయ విద్యార్థులు సూచించారు. మండల పరిధిలోని శీలాంపల్లిలో ఆదివారం గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో భూసార పరీక్షల కోసం మట్టిని సేకరించే పద్ధతిని చేసి చూయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొలాల్లో త్రిభుజకారంలో 15–20 సెంమీ గుంత తీయాలన్నారు. ఆ తర్వాత పై పొర నుంచి కింది పొర వరకు ఒక ఎకరంలో 8 నుంచి 10 చోట్ల మట్టిని సేకరించాలన్నారు. ఇలా సేకరించిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు లేకుండా చూసుకుని నీడలో ఆరబెట్టాలని చెప్పారు. అలాగే మట్టి నమూనా కోసం పరికరాలు శుభ్రంగా ఉండేలా ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా మట్టిని సేకరించాలని వివరించారు. అయితే ఈ భూసార పరీక్షకు తడసిన మట్టిని వాడకూడదని సూచించారు. చివరగా సేకరించిన మట్టిని వెంటనే ల్యాబ్‌కు పంపించాలని, ఆలస్యమైతే ఫలితాల్లో మార్పు రావొచ్చన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా నేలకు అనుగుణంగా పంటలను సాగుచేస్తే రైతులు అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అరుణజ్యోతి, ఉషశ్రీ, రుచిత. శ్రీదివ్య, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతాం

జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి



బాకీ కార్డులు పంపిణీ చేస్తున్న కంఠారెడ్డి తిరుపతి రెడ్డి

నిజాంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో గద్దనెక్కిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వంజర సంఘంలో మండల స్థాయి బీఆర్ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగానే కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు బాకీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగటేట్టందుకే బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్య రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపరి నరసింహులు, అరుణ్ కుమార్, అనూష లక్ష్మి నరసింహులు, సంగుస్వామి, మాజీ ఎంపీటీసీలు చింతల స్వామి, బాల్‌రెడ్డి, కల్వకుంట, నిజాంపేట పీఏసీఎస్ చైర్మన్లు అందె కొండల్ రెడ్డి, బాపురెడ్డి, ఆయా గ్రామాల అధ్యక్షులు దుర్గయ్య, నరేందర్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మావురం రాజు, నిజాంపేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చెలమేటి నాగరాజు, నాయకులు లచ్చపేట రాములు, మల్లేశం, సోమ్లా నాయక్, సుభాష్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సాపూర్: ప్రభుత్వ జూనియర్ కాలేజీ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 1987–88లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన సమ్మేళనంలో ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు.

భగవద్గీతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి



భగవద్గీతను వివరిస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

మనోహరబాద్(తూప్రాన్): భగవద్గీతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు సూచించారు. ఆదివారం కాళ్లకల్‌లో ఇంటింటికి భగవద్గీత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువు తన జ్ఞానాన్ని బోధించి శిష్యుల్లో జ్ఞాన జ్యోతి వెలిగిస్తారని తెలిపారు. దీపావళి రోజున ఇంటి బయట దీపాలు వెలిగించడం అనేది భగవంతుడు బాహ్య ప్రపంచమంతా నిండి ఉన్నాడనడానికి నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరూ దీపాలను వెలిగించి దీపావళి పండుగను ఘనంగా జరుపుకోవాలని, ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరి, నర్సింహచారీ, మధు, మహేశ్, పాపిరెడ్డి, శ్రీనివాస్, పద్మ, చంద్రకళ, ప్రియ, నాగమణి, ఉమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను జెడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నగొట్టిముక్లకి చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో బీఆర్ఎస్ నాయకులతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగరావు, నరేందర్, భిక్షపతిరావు, పాపయ్య, సలీమ్, తదితరులు ఉన్నారు.


దుండగులను కఠినంగా శిక్షించాలి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి శివారులో శనివారం గిరిజన మహిళ అత్యాచారం, హత్య విషయంపై జిల్లా బంజారా బేరి జాయింట్ సెక్రెటరీ వినోద్‌నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ సంఘటన ఏకమైన చర్యగా పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, పోలీసులు త్వరితగతిన కేసు దర్యాప్తు చేసి ఘటనకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పెద్దమ్మ కాలనీలో కరెంటు సమస్య

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమ్మ కాలనీలో కరెంటు సమస్య తీవ్రంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో కరెంటు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో ఒకటి పాడవడంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో ఉదయం నుంచి కరెంటు లేదని, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కాలనీకి కరెంటు సరఫరా చేసేందుకు ఎక్కువ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయడంతోనే సమస్య తలెత్తుతుందన్నారు.అయితే రాత్రి సమయాల్లో కరెంటు సరఫరా పునరుద్ధరించారని కాలనీ వాసులు చెబుతున్నారు.

సన్నధాన్యం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



విజృంభణ, ఏఈఓ

చిన్నశంకరంపేట(మెదక్): సన్నరకం వరి ధాన్యం పంటవేసిన రైతులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నార్సింగి ఏఈఓ విజృంభణ సూచించారు. ఈ నెల 14 వరకు అవకాశం ఉందని, నమోదు చేసుకోని రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అలాగే పత్తి పంట సాగుచేసిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్ తీసుకుని రైతువేదికలో సంప్రదించాలని చెప్పారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

చేగుంట(తూప్రాన్): ఉద్యోగులకు పదవీ విరమణ సహజమేనని, శేషజీవితంలో సేవా కార్యక్రమాలను నిర్వహించాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని మక్కరాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమరశేఖర్‌రెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు ప్రజాసేవలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల ఎంఈఓలు నీరజ, గంగాబాయి, బుచ్యానాయక్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విఠల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రామకృష్ణ, విజయసేనారెడ్డి, ఎంపీడీఓ చిన్నారెడ్డి, నాయకులు శ్రీనివాస్, విశ్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని మద్దుల్‌వాయి పాఠశాలలో మెదక్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఆదివారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రం చేశారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ మురళి మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవ చేసేందుకు ముందుకు రావడంపై అభినందనలు వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించి మంచి పేరు సంపాదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా పరిశీలకుడిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్‌ను కలిసిన చేగుంట నాయకులు

చేగుంట(తూప్రాన్): జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్ జ్యోతి రోటేలాను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నవీన్ తెలిపారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అబ్జర్వర్ జ్యోతి రోటేలా హాజరయ్యారు. ఈ మేరకు దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు అబ్జర్వర్‌ను కలిసినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ప్యాక్స్ చైర్మన్ వెంగళ్‌రావు, మాజీ సర్పంచ్ భాస్కర్, నాయకులు శ్రీనివాస్, మోహన్ నాయక్, బాలనర్సయ్య, జింక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నక్షబాటలో నిర్మాణం

శివ్వంపేట(నర్సాపూర్): నక్షబాటను ఆక్రమించి నిర్మాణ పనులు చేస్తున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆదివారం పలువురు వాపోయారు. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఉసిరికపల్లి, ఎదుల్లాపూర్ గ్రామ శివారులోని నక్షబాటను కొంతమంది ఆక్రమించారని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల నిర్మాణ పనులు చేస్తుండడంతో ఈ విషయంపై ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు పోచయ్య, బుచ్చయ్య, మల్లేష్ ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నక్షబాటను సర్వే చేసి అక్రమ నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు.

సమయపాలన ఏదీ?

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



ఖేడ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు

రేగోడ్(మెదక్): గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన బస్సు సర్వీసుల సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలిస్తున్నా సంబంధిత అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. వివరాల ప్రకారం.. రేగోడ్ మండలానికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న నారాయణఖేడ్ డిపోకు చెందిన ఒక బస్సు సర్వీసును రేగోడ్ మీదుగా రోజూ ఉదయం పటాన్‌చెరుకు నడుపుతున్నారు. ఈ సర్వీసుకు ప్రయాణికుల నుంచి ఆదరణ ఉన్నా సంబంధిత అధికారులు సమయపాలన పాటించడం లేదు. ఒకరోజు నడిపితే మరుసటి రోజు నిలిపివేస్తున్నారు. దీంతో బస్సు వస్తుందో లేదో తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ రూట్‌లో నిత్యం ప్రయాణికులు పనుల నిమిత్తం పటాన్‌చెరు, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్తుంటారు. అలాగే పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో బస్సు సర్వీసులు సమయపాలన పాటించకపోవడంతో ప్రైవేట్ వాహనాలకు ఆశ్రయించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిత్యం బస్సు నడిపేలా చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.